

# ఆకాశదీపం

## పైడిపాల

తుపాకీ కాల్పుకి బిల బిలమంటూ చెల్లా చెదరైన పక్షుల్లా- లాంగ్ బెల్ వినగానే పిల్లలు పలకలూ, పుస్తకాలూ చేత బట్టుకొని ఇళ్ళకు పరుగెత్తారు.

ఖైదీలను కాపలా కాసే పోలీసుల్లా పగలంతా పిల్లలతో విసిగిపోయిన ఉపాధ్యాయులు తేలికపడ్డ మనసులతో కబుర్లాడుకుంటూ రోడ్డెక్కారు.

హెడ్మాష్టరు అవధానిగారు ప్యూను

శివయ్యతో జాగ్రత్తగా తలుపులు బిగించమని చెప్పి సైకిలెక్కాడు. ఇండియా పటం కింద సింహళం ఉన్నట్టు, ఊరికి దూరంగా తోటల్లో వుంది ఆ ఎలిమెంటరీ స్కూలు.

ఆ రోజునుంచి పది రోజులపాటు స్కూళ్ళకి సంక్రాంతి సెలవలు.

అర డజనుమంది మాష్టార్లూ, నాలుగొందల మం(ద)ది పిల్లలూ వున్న ఆ స్కూలుకి ప్యూనూ, వాచ్ మన్, అటెండరు, బోయ్ వగైరా అన్నీ యాభై ఏళ్ళ పైబడిన శివయ్యే!

శివయ్యకి ఆరోజు మహదానందంగా వుంది. మనస్సుకి రెక్కలొచ్చాయి. శివయ్యకి మందు ఆరో ప్రాణం. కాని కోడలు వాణి ఎదుట పడితే మందు మంచి నీళ్ళుగా మారి పోయేటంత హడల్!

వాణిని పండక్కి పుట్టింటికి పిలవడానికని నిన్న వాళ్ళన్నయ్య శేషు వచ్చాడు. నిన్న సాయంకాలమే వెళ్ళాల్సింది. కాని గోపి స్కూలు మాననని మంకుపట్టు పట్టడంవల్ల ప్రయాణం ఈ సాయంత్రానికి వాయిదా పడింది. వాణి ఈసరికి గోపితో సహా బండెక్కి వుంటుంది కనుక, తను దర్జాగా గుర్రమెక్కి యింటికి పోవచ్చు. కొడుకు యింట్లో వున్నా తనని అంతగా పట్టించుకోడు. దేశానికి స్వతంత్రం రావడం నిజమో అబద్ధమో తనకర్థం కావడం లేదుకాని, తనకి మాత్రం ఇవాళ సంపూర్ణ స్వతంత్రం! కళ్ళముందు స్వర్గం కదలాడుతుండగా శివయ్య హడావుడిగా స్కూలుకి తాళాలు బిగించి కొబ్బరి తోపులో కలిసి పోయాడు.

* * *

కూనిరాగం తీసుకొంటూ హుషారుగా రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరిన శివయ్యకి, గుమ్మం దగ్గర శోకదేవతలా నిలబడ్డ వాణిని చూడగానే సగం మత్తు దిగిపోయింది. వాణితో పాటు నలుగురైదుగురు ఇరుగు పొరుగు ఆడాళ్ళు కూడా వసారాలో కూర్చొని వున్నారు. శివయ్యని చూడగానే వాణి దుఃఖం కట్టలు తెంచుకుంది.

"గోపి కనిపించాడా మావయ్యా?"

"గోపి బడినుంచి యింటికి రాలేదా?" శివయ్యకంతా అయోమయంగా వుంది.

"లేదయ్యా! గోపి వత్తాడని అమ్మాయి ప్రయాణం మీదుంది. మిగతా పిల్లలంతా వచ్చేసినా ఆడింత దాకా రాలెదు. అమ్మాయి కంగారు పడి కళ్ళ నీళ్ళెట్టుకుంటుంటే మీ బెమ్మాజీ, ఈళ్ళన్నయ్య వెతకడానికని యెళ్ళారు." పక్కింటి పార్వతమ్మ పరిస్థితిని వివరించింది.

**అతని ఆశయాల దీపం**
**ఆమె ఆశల దీపం**
**యింటికి వెలుగైన దీపం**
**ఆకాశ దీపమై వెలిగింది.**

"ఆడు బడినుంచి ముందే వచ్చేశా డనుకున్నా! పిచ్చి సన్నాసి. ఎక్కడాడు కుంటున్నాడో యేమో, సూసొత్తా." గుమ్మంలోంచే వెను దిరగబోయాడు శివయ్య.

"బడికాడ నేలనూతులు గట్రా ఏం లేవుకదా?" పార్వతమ్మ సందేహం వెలిబుచ్చింది.

"అట్టాంటి భయమేం లేదమ్మా! ఆ సుట్టుపక్కల పెసిడెంటు గారు కొట్టించిన పైపు తప్ప నూతులు గోతులు లేవు. ఏ జతగాళ్ళతోనో యెళ్ళుంటాడు తప్ప గోపికేం బయంలేదు. నేనెళ్ళి యెతికొత్తాను. మీరేం అధైర్య పడకండి."

"అదేమాట యింతదాకా మేమూ సెపుతున్నామయ్యా! కాని వాణి యిదయి పోతోంది. ఎంతయినా కన్నకడుపు కదయ్యా!"

శివయ్య దీర్ఘంగా నిట్టూర్చి బయ లేరే సమయానికి బ్రహ్మాజీ, శేషు సైకిళ్ళమీద వచ్చి వాలారు.

"ఏరా! ఎక్కడా కనిపించ లేదా?"

"లేదు నాన్నా! నువ్వు రావడం ఆల్యసమయిందని నీతోనే వున్నాడేమో అనుకుంటున్నాం ఇంత వరకూ. ఇక ఆ ఆశకూడా లేదన్న మాట."

"వాణ్ని వూరికి తీసుకెళ్తానని కోడలు పెందరాళే బడినుంచి వచ్చే సెయ్యమని సెప్పింది. అంచేత మద్దెలోనే యెళ్లిపోయా డనుకున్నాను. బెల్లు కొట్టినమీదట నాకు కనిపించనే లేదు."

"ఈరోజు స్కూలుకే వెళ్ళొద్దురా అని ఎంత మొత్తుకున్నా వినలేదు. ఆఖరి రోజు బడికి వెళ్ళాలని భీష్మించుకు కూర్చున్నాడు. లేక పోతే నిన్నే ప్రయాణమై వుంటే ఇలా జరిగేదా?" అంది వాణి.

"ఏవిటో అలా అనుకుంటాం గాని రాతనెవరు తప్పించగలరు తల్లీ! అయినా కర్మ గాకపోతే అయిదేళ్ళ బిడ్డకి సదువంటే అంత సెద్దేమిటి సెప్పు?" పార్వతమ్మ కర్మ సిద్ధాంతాన్ని వల్లించి వాణిని సముదాయించడానికి ప్రయత్నిస్తోంది.

"ఒరేయ్ బాబూ! నేను గోపి జత

గాళ్ళనికూడా కనుక్కొని వస్తాను. నువ్వు స్టేషన్‌కి వెళ్ళి చెప్పిరా- ఎందుకైనా మంచిది.'' శివయ్య గోపిని గాలిస్తూ ఊరిమీద పడ్డాడు. శేషు, బ్రహ్మాజీ కంప్లయింట్ యివ్వడానికి పోలీసు స్టేషనుకి వెళ్ళారు.

* * *

నడి వయస్సులో భార్య చనిపోయిన శివయ్య కష్టపడి చదివించి బ్రహ్మాజీని తనకంటే పైమెట్టున నిలుపగలిగాడు. ఎల్డీసీగా ఉద్యోగ పర్వాన్ని ప్రారంభించి ఇటీవలే యు. డి.సి.గా విజయాన్ని సాధించాడు. బ్రహ్మాజీ ఏకైక పుత్రుడు గోపి. గోపి పుట్టిన తర్వాత వాణి మళ్ళీ తల్లి కాకూడదని డాక్టరు హెచ్చరిక. ఆ శాసనం మేరకి ఆపరేషను జరిగిపోయింది. అందుకే గోపి అంటే వల్లమాలిన గారాబం. కాని ఆప్యాయత ఎక్కువయినా గోపి చెడిపోలేదు. మూడేళ్ళకే పలక బట్టాడు. నాలుగేళ్ళకే పద్యాలు, పాటలు అప్పజెప్పాడు. అయిదేళ్ళ వయసుకి ఒకటో తరగతిలోకి వచ్చాడు.

శివయ్య, గోపి జతగాళ్ళ యిళ్ళకు వెళితే కొందరు తల్లిదండ్రులు నిద్ర లేపనివ్వలేదు. మరి కొంతమంది నిద్రలో ఏవేవో చెప్పేరు.

ఊరికి మైలు దూరంలో టూరింగ్ టాకీసు వుంది. సినిమా విడిచిపెట్టే సమయానికి అక్కడ కాచి ప్రతి మొహం పరిశీలనగా చూశాడు శివయ్య. గోపికి ఎవరితోనూ సినిమాకి వెళ్ళే అలవాటు లేదని, ఆ వయసు కాదని తెలుసు. అయినా అనుమానం అలా నడిపించింది. గోపి జాడ లేదు!

* * *

రెండ్రోజులు గడిచాయి.

గోపి సమాచారం ఏం తెలియలేదు. గోపిది పారిపోయే వయస్సుకాదు- ఎవరైనా తీసుకుపోయే వయసు. అలా తీసుకుపోవడానికి తగిన కారణాలను బ్రహ్మాజీ మిత్రులు శ్రేయోభిలాషులూ ఊహిస్తున్నారు. తరాజు (అసలు పేరు తాతరాజు) బ్రహ్మాజీ ఆఫీసులో ఓ ఆముదం చెట్టు మార్కు రచయిత.

"గురూగారు, అలా తప్పిపోవడం గురించి నేను చాలా కథలూ, వార్తలూ చదివాను. ముష్టి వాళ్ళున్నారు చూడండి, వాళ్ళు దొంగనాయాళ్ళు. వాళ్ళలాంటి పసిపిల్లల్ని ఎత్తుకుపోయి కాళ్ళో కళ్ళో తీసేసి ప్లాటుఫారం మీద పెట్టుకొని అడుక్కొంటూ డబ్బులు సంపాయిస్తారండీ! ఒక వేళ అలా ఏదయినా...

అహ కీడెంచి మేలెంచమన్నారు.." అంటూ తన పరిధిలో అనుమానాన్ని వ్యక్తం చేశాడు తరాజు.

"మాచవరంలో ఆంజనేయ స్వామి ఉపాసకు డొకాయన ఉన్నాడు. ఆయనను ప్రశ్నలడిగితే అబ్బాయి ఏమైందీ చెప్పగలడు. మా పెద్దమ్మాయి పెళ్ళి సంబంధం విషయంలో ఆయన చెప్పింది అక్షరాలా జరిగింది." సహోద్యోగి సీతారామశాస్త్రిగారి సలహా.

ఎవరేమి చెబితే అది ప్రయత్నించాడు బ్రహ్మాజీ. తనకు నమ్మకం లేకపోయినా కొడుకు మీద మమకారం కొద్దీ అన్నిటికీ తలూపాడు. కానీ ఫలితం కనిపించ లేదు!

* * *

వారం రోజులు గడిచిపోయాయి. ఆరోజు మకర సంక్రాంతి.

ఊరంతా వేడుకలతో కోలాహలంగా వుంది.

వాణి అన్నం ముట్టడంలేదు. చిక్కి శల్యమై పోయింది. నిన్న భోగి మంటల్లో దండల్ని వేసుకొనే పిల్లల్ని చూసినప్పుడు ఆమె హృదయంలో జ్వాలలు చెలరేగాయి. శివయ్య సరేసరి. ఇంటి పట్టున వుండటం లేదు. పిచ్చివాడిలా ఊరూరా తిరుగుతున్నాడు.

గోపి కనిపించాడు!

శివయ్య సెలవల అనంతరం బడి తలుపులు 'తెరిచినప్పుడు.

రెండు బెంచీల మధ్య బోర్లగిల పడి!

శవం రూపంలో! దుర్గంధాన్ని వెద జల్లుతూ!!

ఆ దృశ్యాన్ని చూసిన శివయ్య గుండె శతథాభిన్నమయింది—నేలకేసికొట్టిన అద్దంలా! పగిలిన అద్దం ముక్కల్లో జరిగిన సంఘటనల శకలాలు...!

బడి విడిచిపెట్టే సమయానికి నిద్రపోతున్న గోపిని 'పరవశం'లో వుండెమో టీచర్ దమయంతి పట్టించుకోలేదు!

మందు ఆత్రుతతో వున్న శివయ్య చూడకుండా తలుపులు బిగించాడు... మెలకువ వచ్చి ఏడ్చి మొత్తుకొని తలుపులు రాని చీకటి గదిలో అయిదేళ్ళ గోపి అన్నం నీళ్ళు లేక... ఆకలితో కేకలేసి కేకలేసి... గోడు వినిపించుకునే నాధుడు లేక... కృశించి కృశించి...

శివయ్య మస్తిష్కంలో వెయ్యి తుపాకుల మోత...! *